నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | KHAMMAM

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తే ఊరుకోం..

- సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం ఎందుకు?
- సీఎం రేవంత్ తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు
- తెలంగాణ తల్లిని కాదని గాంధీ కుటుంబానికి ప్రాధాన్యంపై ఆగ్రహం
- ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 'తెలంగాణ తల్లి'కి క్షీరాభిషేకాలు

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంతో చెలగాటమాడితే ఊరుకునే దిలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. 'ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల మెప్పు కోసం రాష్ట్రంలో పిచ్చిపిచ్చి నిర్ణయాలు తీసుకుంటే సహించబోమని, మీ పార్టీ నాయకుడు రాజీవ్‌గాంధీపై మీకు ప్రేమ ఉంటే.. మీ పార్టీ కార్యాలయాల్లో ఆయన నిలువెత్తు విగ్రహాలు పెట్టుకోవాలని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాదని.. మరే విగ్రహాన్ని పెట్టినా ఊరుకోబోమని' ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 ఏళ్లు కేసీఆర్ అలుపెరుగకుండా పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందంటూ ఖమ్మం ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలు రేవంత్ తీరుపై మండిపడ్డారు. సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళ వారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకాలు చేసి నిరసన వ్యక్తం చేశాయి.

- ఖమ్మం, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కాంగ్రెస్‌ది దుర్మార్గపు పాలన

- తెలంగాణ తల్లిని కాదని.. రాజీవ్ విగ్రహమా?
- ప్రశ్నించిన బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 17 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నదని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మండిపడ్డారు. హైదరాబాద్ సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళ వారం మణుగూరు పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టకుండా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి మాయ పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత అజెండా ఏమిటో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మలిదశ ఉద్యమంలో 14 ఏళ్లు కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకుల తీరుతో అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

తెలంగాణ తల్లి కంటే రాజీవ్‌గాంధీ గొప్పవాడా? రాజీవ్‌గాంధీ తెలంగాణ ప్రాంతానికి ఏం చేశాడని అతడి విగ్రహం సచివాలయంలో ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని అవమానపరిచిన కాంగ్రెస్ పాలకులు తెలంగాణ రాష్ట్రానికి అవసరమా అని ఆయన ప్రశ్నించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగ్గిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుర్రి నాగేశ్వర రావు, అడపా అప్పారావు, ముత్యం బాబు, ముద్దంగుల కృష్ణ, బొలిశెట్టి నవీన్, తురక రామకోటి, లక్ష్మణ్, బోశెట్టి రవిప్రసాద్, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

- 2029 తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తాం..
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు
- తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకాలు

అశ్వారావుపేట/ దమ్మపేట, సెప్టెంబర్ 17: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు అశ్వారావుపేట రింగ్ రోడ్డు సెంటర్, దమ్మపేట మండలం ముష్టిబండలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2029 ఎన్నికల తర్వాత కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీయే తిరిగి అధికారంలోకి వస్తుందని, అప్పుడు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రేమతో ఇవ్వలేదని, కేసీఆర్ నేతృత్వంలో 14 ఏళ్లు కొట్లాడి తెచ్చుకున్నామని ఆయన గుర్తు చేశారు. గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఏ హామీని అమలు చేయకపోగా.. దబాయింపు చర్యలకు పాల్పడుతూ అన్ని వర్గాల ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ అధిష్టానం మెప్పు కోసమే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు తప్ప ఆయనపై ఎలాంటి ప్రేమ లేదని ఎద్దేవా చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, పార్టీ మండల కార్యదర్శి వెంకన్నబాబు, పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, దమ్మపేట బీఆర్ఎస్ మండల కార్యదర్శి దొడ్డా రమేశ్, జిల్లా శిశు సంక్షేమ మాజీ కోఆర్డినేటర్ తూతా నాగమణి, ఉపసర్పంచ్ దారా యుగంధర్, సీనియర్ నాయకులు అంకత ఉమామహేశ్వరరావు, వేంపాటి భరత్, మాజీ సర్పంచ్‌లు ఉయ్యాల చినవెంకటేశ్వరరావు, తూతా రామకృష్ణ, పాకనాటి శ్రీను, దొడ్డా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట రింగ్ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా, బీఆర్ఎస్ నాయకులు

అమరవీరుల ఆత్మ క్షోభిస్తుంది..

అధిష్టానం మెప్పు కోసమే రాజీవ్ విగ్రహం
మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్

జగదాంబ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 17 : హైదరాబాద్ సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెడితే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆత్మ క్షోభిస్తుందని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ అన్నారు. హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణను వ్యతిరేకిస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో తెలంగాణ తల్లికి ఆమె క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ అమరుల గురించి నాడు రేవంత్‌రెడ్డి.. ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీని బలిదేవత అన్నారని గుర్తు చేశారు. నేడు ఢిల్లీ అధిష్టానం మెప్పు కోసం సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు రేవంత్ పాలనను గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్, ఉద్యమ నాయకులు సిలివేరు సత్యనారాయణ, దేవీలాల్ నాయక్, అజ్మీరా భావ్‌సింగ్, కౌన్సిలర్లు జేకే శ్రీను, తోట లలిత, శారద, చీమల సుజాత, సందా బిందు, కడకంచి పద్మ, నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, జబ్బార్, గిన్నారపు రాజేశ్, కావేటి రమేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవంతో రేవంత్ చెలగాటం

- ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ
- బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు
- ఖమ్మంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం
- పెద్దసంఖ్యలో హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఖమ్మం నగరంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఇతర నాయకులు

ఖమ్మం, సెప్టెంబర్ 17 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంతో చెలగాటమాడుతున్నారని, నిన్నటివరకు కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్‌గాంధీని ముద్దపప్పు అని తిట్టిన రేవంత్ ఢిల్లీ పెద్దల మెప్పు కోసం హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణను వ్యతిరేకరిస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఖమ్మం నగరంలో పార్టీ ఆధ్వర్యంలో మంగళ వారం ఎన్‌టీఆర్ సర్కిల్‌లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పగడాల నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ తల్లిని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరానికి ప్రతీకగా నిర్మించిన సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల మండిపడ్డారు. వందలాది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమైన కాంగ్రెస్ నాయకుల విగ్రహాలను సచివాలయం వేదికగా తెలంగాణ తల్లిని అవహేళన చేస్తూ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్రజా వ్యతిరేకత ఉన్నప్పటికీ రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి నిర్ణయాలు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇవ్వని రేవంత్ రెడ్డి నాడు ఉద్యమకారులపై తుపాకిని ఎక్కిపెట్టిన సంఘటనను గుర్తుచేశారు. అధికారం చేతిలో ఉంది కదా అని కాంగ్రెస్ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసినప్పటికీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సకల మర్యాదలతో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కి తరలించడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బి.రెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు మోతరపు శ్రావణి సుధాకర్, కూరాకుల వలరాజు, దండా జ్యోతిరెడ్డి, మాటేటి అరుణనాగేశ్వరరావు, తోట ఉమారాణివీరభద్రం, మాజీ కార్పొరేటర్ మచ్చ నరేందర్, ఉద్యమకారులు శేషు, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, గొల్లపూడి హరి, నగర ప్రచార కార్యదర్శి షకీన, ఊబ్బలపల్లి నిరోషా, అబ్బాస్, 21వ డివిజన్ ఇన్‌చార్జి ఉస్మాన్, మాటేటి రామారావు, పొదిల నాగరాజు, మందడపు కృష్ణారావు, గోగుల వీరయ్య, గండ్రు రవి, తుమ్మలపల్లి కోటి, ఆవుల లక్ష్మీనారాయణ, మొర్రిమేకల కోటయ్య, దానయ్య, పారా ఉదయ్, మాటేటి కిరణ్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సురేష్, 10వ డివిజన్ అధ్యక్షుడు పాషా, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ముజాహిద్, తోడేటి లింగరాజు, ఎస్సీ సెల్ నాయకులు ఎచ్చు ప్రసాద్, ఆరెంపుల వీరభద్రం, నెమలి కిషోర్, మాతంగి అనిల్, కోడిరెక్కల ఫ్రాన్సిస్, వీరేందర్, చంద్రకాని శ్రీనివాస్, చిలుమూరు కోటి, సత్యనారాయణరెడ్డి, రాజు, మల్లేశం, ఉదయ్, సురేష్, శ్రీనివాస్, శ్రీను, ఉపేందర్, సాయి, కిషోర్, వెంకట్, తిరుమల్, విజయ్ భవాని, నాగరాజు, కేసీఆర్ టవర్స్ శివ, శైలజ, నగేష్, మాధవి, రామారావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీపడేలా అభివృద్ధి

- అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ
- మున్నేరు వరద బాధితులను సంపూర్ణంగా ఆదుకుంటాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : విద్యా, వైద్యం, వ్యవసాయం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, సాగునీటి రంగం, పారిశ్రామిక అభివృద్ధి, అడ్వాన్స్ టెక్నాలజీ వినియోగం వంటి ప్రాధాన్యత రంగాల్లో ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో జరిగిన విరోచిత పోరాటాల ఫలితంగా మన ప్రాంతం రాజుల పాలన నుంచి ప్రజాస్వామ్య భారతదేశంలో 1948 సెప్టెంబర్ 17న విలీనంకావడం జరిగిందని, దీనిని ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేశామని, జిల్లాలోని 1,15,180 మందికి 766 కోట్ల 66 లక్షల పైగా రుణ మాఫీ చేశామన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణ మాఫీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా కురిసిన కుండపోత వర్షాల కారణంగా ఖమ్మంలో మున్నేరు వాగు 40 అడుగులకు పైగా ఉధృతంగా ప్రవహించి వరదలతో ముంచెత్తిందని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలు కాపాడుతూ సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేయడంలో జిల్లా యంత్రాంగం, అన్నిశాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ప్రశంసించారు. వరదల వల్ల ఇళ్లు దెబ్బతిన్న 15 వేల 96 కుటుంబాలకు 16 వేల 500 రూపాయల చొప్పున పంపిణీ చేశామని, పంటనష్టం జరిగిన ప్రతి ఎకరాకు పదివేల రూపాయల పరిహారం, ఆస్తి, పశు నష్టం జరిగిన వాటికి పరిహారాన్ని అందజేస్తామని తెలిపారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. జిల్లా పౌర సరఫరాలశాఖ, వ్యవసాయ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఎన్‌పీడీసీఎల్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం..
- రైతుల్ని రుణవిముక్తి చేశాం..
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేసిన మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను కొనసాగిస్తున్నదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. అంతకుముందు ప్రగతి మైదానంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మంత్రి తుమ్మల మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కలిసి ఇప్పటికి 76 ఏండ్లు అయ్యిందని, దీన్ని ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. రైతులను రుణవిముక్తి చేసేందుకు రూ.2 లక్షల చొప్పున జిల్లాలో 57,983 మందికి రూ.415,27 కోట్లు రుణ మాఫీ చేశామన్నారు. భద్రాద్రి రామయ్యకు దూర ప్రాంతాల నుంచి భక్తులు రావడానికి వీలుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. త్వరలో రైలుమార్గం కూడా వస్తుందన్నారు. స్టేడియం గ్రౌండ్‌లో రైతుల కోసం ఏర్పాటు చేసిన వివిధరకాల వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి సందర్శించారు. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీను, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీఎవో బాబూరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

యువ కార్మికులు శ్రమశక్తిని చాటాలి

సింగరేణి సీఎండీ బలరాం

ప్రముఖుల చిత్రపటాలకు నమస్కరిస్తున్న సింగరేణి సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 17 : సింగరేణి సంస్థలో ప్రస్తుతానికి 50 శాతం కన్నా ఎక్కువ మంది యువత విధులు నిర్వర్తిస్తున్నారని, వారంతా సంఘటితంగా తమ శ్రమశక్తిని చాటితే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సింగరేణి సీఎండీ బలరాం ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం ఆయన జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో సింగరేణి సంస్థ 60 వేల టర్నోవర్‌ను సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సహకారంతో సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ దిశగా ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్, సింగరేణిలో మూసివేసిన ఓసీ గనుల్లో పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు, ఎస్‌టీపీపీలో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా ఈ ప్రాంత యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ కల్పించే అవకాశం లభిసుందన్నారు. దీనికి కార్మికులు, అధికారులు, కార్మిక సంఘాల తోడ్పాటు కూడా అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీఎంలు ఎస్‌డీఎం సుభాని, రవిప్రసాద్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

గణేశుడికి ఘనంగా వీడ్కోలు

భద్రాచలం: నిమజ్జనానికి లాంచీలో తరలుతున్న గణనాథులు

భద్రాచలం గోదావరిలో రాత్రివేళ నిమజ్జనానికి గణనాథులు

గంగ ఒడికి చేరేందుకు గోదావరి ఒడ్డున సిద్ధంగా ఉన్న విగ్రహాలు

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ బూర్గంపహాడ్ (భద్రాచలం)/ కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 17: వినాయక చవితి సందర్భంగా నవరాత్రులు పూజలందుకున్న గణేశుడికి భక్తులు మంగళ వారం ఘనంగా వీడ్కోలు పలికారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు నియోజకవర్గాల నుంచి గణపయ్య విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా భద్రాచలం వద్ద గోదావరి నదికి తీసుకెళ్లారు. భక్తుల తోపాటు గణేశ్ మాలధారణ స్వాములు కాషాయ కండువాలతో స్వామి వెంట నడిచారు. ప్రతి పల్లె సందడిగా మారింది. కొత్తగూడెం జిల్లా కేంద్రం సూపర్‌బజార్ సెంటర్‌లో వినాయక ఉత్సవ సమితి నాయకులు ఊరేగింపుగా వస్తున్న విగ్రహాలకు పూలదండలు వేశారు. కొన్ని ప్రాంతాల్లో స్థానిక చెరువుల్లోనే నిమజ్జనాలు జరిగాయి. కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన గణపతి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని శోభాయాత్రను ప్రారంభించారు. రైల్వేస్టేషన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన స్వాగత వేదికపై నుంచి వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా నిమజ్జనానికి బయల్దేరిన వినాయక విగ్రహాలకు పూలమాల వేసి వీడ్కోలు పలికారు. భద్రాచలం వద్ద గోదావరి తీరమంతా భక్తులతో సందడిగా మారింది. ఇతరప్రాంతాల నుంచి కూడా భద్రాచలానికి గణేశ్ విగ్రహాలు భారీగా తరలిరావడంతో కరకట్ట వద్ద ప్రత్యేకం ర్యాంప్‌తోపాటు లాంచీల ద్వారా నిమజ్జనాలు చేశారు. భద్రాచలంలో 250 మంది పోలీసులతో ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో ఏఎస్పీ అంకిత్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్డీవో దామోదర రావు, తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు.

భద్రాచలం: వినాయకుడి విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తున్న గజ ఈతగాళ్లు, సిబ్బంది

కొత్తగూడెం నుంచి తరలుతున్న విఘ్ననాథులు

మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

గణపయ్యలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న క్రేన్లు

గోదావరిలో నిమజ్జనమవుతున్న విఘ్నేశ్వరుడు